
# నా కథ నిజమాయె!

## పిప్పళ్ళ సూర్యప్రకాశరావు



పంతులుగారికి ప్రమోషన్ వచ్చింది. ఆయనకు అభినందనసభ ఏర్పాటుచెయ్యాలనిచంద్రారెడ్డి గారు కాంటీన్‌లో అంటే ఎదురుగా కూర్చున్నాయన మంచినీళ్ళు గటగటా తాగేసి, ''కొంపతీసి ఈయన గోడదూకిన బాపతాండీ?'' అని పక్కన కూర్చున్న వాడి చెవి కొరికాడు చెవి కొరికించుకున్న పెద్ద మనిషి తింటున్న ఇడ్లీ గుటుక్కున మింగేసి రెడ్డిగారి వంక ఎగాదిగా చూసి, అందులో సందేహం లేదు బాబోయ్ అని టేబుల్ మీదనున్న కాఫీ తాగకుండానే పారిపోయాడు!

విశ్వవిద్యాలయాన్ని, పిచ్చాసుపత్రిని గట్టిగా గోడ ఒకటి కట్టి వేరుచేసినాగాని, ఇక్కడ చేరిన చాలా మంది విద్యార్థుల్ని అక్కడ చేర్పించాలని మాస్టర్ల నిర్ధారణ కొచ్చేస్తే, అక్కడి నుంచి జెదిరిపోయి వచ్చిన వాళ్ళే ఇక్కడ మాస్టర్లుగా స్థిరపడిపోయారని విద్యార్థులకు అనుమానం పట్టుకు పీకుతుంది! అందువలన విశ్వవిద్యాలయంలో ఎవరిమీద ఎవరికి కొంచెం అనుమానం వచ్చినా ''గోడ దూకిన వాడా!'' అని అనుకోవడం రివాజు

''పంతులుగారంటే అర్థమైంది కాని ఆయన్ను అభినందించాలంటే గోత్రమేమిటో మరి?'' అని అడిగా డొక విశ్వవిద్యాలయ ఆచార్యుల వారు కులం కుదరకపోతే యూనివర్శిటీ కాంటీన్‌లో కనీసం కాఫీ కూడా పొరపాటునైనా కలిసి తాగనని ప్రతిజ్ఞ పూనిన భీష్మాచార్య డాయన! ఆయనకు కునేగా సెంటు కంటే కులం వాసనంటేనే మహా ఇష్టం. కులంకలవకపోతే ఆఫీసుల్లో కలాలు కలపనిభీష్మించు కుంటున్నారు. అందువల్ల ఆఫీసుల్లో ఆలోచించ కుండా పనిచేసే వాళ్ళను ఉత్పత్తి చేస్తున్న విద్యాలయాల్లో కూడా ''కులం ఎలా కలుపుకోవాలి?'' అనే దాని మీద ముందుగా ఒక డిప్లొమా కోర్సు ప్రారంభించా లంటా రాయన. తర్వాత కులం కుర్రాళ్ళను ఉసిగొలిపి ఆందోళన ప్రారంభించి దాన్ని డిగ్రీకోర్సుగా మార్పించి, అటుపిమ్మట ప్రత్యేక శాఖాధిపతిగా మారిపోవాలని ఆయన ఉబలాటం!

''పంతులుగారిది మంచివాళ్ళ గోత్రం. పైది వెళ్ళ గోత్రం మాత్రం కాదు'' అని చిరాగ్గా జవాబిచ్చారు రెడ్డిగారు.

''గురూ!

మీ అభినందన సభకి వైస్ చాన్స్‌లర్‌గా వొస్తారా? రిజిస్ట్రార్‌గా వొస్తారా? లేక ప్రిన్సిపల్ గా వొస్తారా? రారా? ... అయితే దాని గురించి కనీసం ఒక సెకనైనా ఆలోచించడం దండగని'' హడావుడిగా లాబ్‌లోకి వెళ్ళిపోయా డో మూర్తి. అంతవరకూ వెనకన కూర్చున్న వాడు, పెద్దవాళ్ళు వచ్చినప్పుడు మాత్రమే ముందుకు వచ్చి, లేనిపోని పెద్దరికం తనే అంటగట్టుకుని మీటింగుల్లో మనుస్నా, లేకపోయినా హడావుడిగా తిరిగే పెద్ద మనిషాయన.

''పార్టీ ఇచ్చి ప్రసన్న ప్రెజెంట్ చేస్తే ఎలా ఉంటుందండీ?'' అని రెడ్డిగారి స్నేహితుడు ప్రభాకర్ గారడిగారు మరో లెక్చరర్ని.

''ఒకే! తలో పది రూపాయలు వేసుకొని బుడ్డి కొట్టి డిన్నరు లాగించేద్దాం'' అన్నా రెవరో.

''బహుమతి ఇవ్వటానికి మిగిలే దేముంటుంది ఖాళీ పీపాలు తప్పితే.''

''అలాగంటే ఎలా బ్రదర్. ఎవరో ఒకరి పేరు మీద రోజూ తాగుతూనే ఉన్నాం కదా. పోనీ ఈ రోజు పంతులు గారి పేరుమీద తాగేద్దాం. ఆ మాత్రం త్యాగం చెయ్యలేకపోతే జీవితం నిరర్థకం బ్రదర్!'' అన్నారు మరొకరు.

కుర్రవాళ్ళను కూడా కదిపి చూశారు.

''కులాల సంఘాలు యూనివర్శిటీలో పెట్టి ఏదో వంకతో రోజూ కొట్టుకోడానికే టైం చాలడం లేదు మాస్టారూ!

ఏమాత్రం సమయం చిక్కినా లేడీస్ హాస్టల్సు దగ్గర, సినిమాహాళ్ళ దగ్గర బీటు కయ్యాలి గదాండీ.

అసలు మేమీ మధ్య తెరమీద తారలను మాత్రమే సన్మానించాలని తీర్మానించుకున్నాం. పోతే పంతులుగార్ని అర్జంటుగా మద్రాసెళ్ళి ఏదో సినిమాలో ఎక్‌స్ట్రా వేషమైనావేసి రమ్మనండి.. చెయ్యకపోతే మమ్మల్ని అడగం డప్పుడు'' అని కూడా హామీ ఇచ్చారు. అవుట్ గేట్ అయ్యరు బీరుబాటిల్ ధర రోజు రోజుకీ పెంచుతున్నాడు కాబట్టి సన్మానానికి డబ్బులు కూడా సర్దలేమని యూనివర్శిటీ కుర్రాళ్ళు తమ నిస్సహాయతను వెలిబుచ్చారు.

• • •

''పంతులుగార్ని సన్మానిద్దామని మన మిత్రు లందరూ అంటున్నారు. ఏమంటారు?'' అన్నారు రెడ్డిగారు. ఉలిక్కిపడ్డాను నేను.

''అదేమండి ఇంతక్రితమే పంతులుగారు స్వయంగా చెప్పి వెళ్ళారు. తనకు ప్రమోషన్ వచ్చిందని. అది తెల్సినప్పటినుంచీ డిపార్ట్‌మెంట్ అంతా మీకోసం వెతుకుతున్నారు. ఇంతకీ మీ రేమంటారు?'' నాకు మాటలు పెగలడం లేదు.

''మీరే కదా కథ రాశారు. పంతులగారిలాంటి వాళ్ళని సన్మానించాలని'' రెడ్డిగారి మాటల్లో నిజా

ఖాళీ ఉంది.

"ఆ మీటింగులో మీరు తప్పక మాట్లాడాలి. కాదన కూడదు. ఇతర డిపార్ట్‌మెంట్‌లోని మిత్రుల సహకారం కూడా కోరాలి. రేపే పంతులుగారికి ఖాళీ ఉంటుందట. టైంలేదు వస్తాను" అని వెళ్ళిపోయాడు.

నా మనసు సంతోషంతో కేరింతలు కొట్టింది. ఇంటికి వచ్చిన వెంటనే శ్రీమతితో చెప్పాను.

"మీటింగ్ అంటున్నారు. టీ పార్టీకూడా ఉంటుందంటున్నారు. ఇంతకీ రచయితగారెంత ఇస్తున్నారో" అని అడిగింది శ్రీమతి.

"పదకొండు రూపాయలిచ్చాను తెల్సా" అని కాలరెగరేశాను. అదోలా నవ్వింది నా భార్య. ఆ నవ్వుకి భాష్యం చెప్పడం ఏ భాషకీ చేతకాదు. పద్నాలుగేళ్ళ కాపురం ముందు అంటే మరదలు పెళ్ళాం కాకముందు నుంచీ కూడా ఆ నవ్వుకి అర్థం నాకు తెలియదు. తన పర్సంత తడిమి పది రూపాయలు తీసిచ్చి, పాప డాన్స్ ఫీజు వచ్చేనెల కడదాం. ఇది కూడా ఇచ్చెయ్యండి" అంది శ్రీమతి. పేరుగొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా నేను చేస్తుంది ఒకానొక రాష్ట్రంలో అసిస్టెంట్ డ్రగ్స్ కంట్రోలర్ ఉద్యోగమైనా కొంతమంది శ్రేయోభిలాషుల చలువవలన పదిహేడు నెలల నుంచీ జీతంరావడం లేదు. నేను ఖర్చుపెట్టే ప్రతి పయాపైసా రోజు రోజుకీ బరువై పోతుంది.

ఆ పది రూపాయలు జేబులో వేసుకొని మా పాప వాణిని పిలిచి రెండుబుకేలు త్వరగా కట్టెయ్యమ్మా అని చెప్పాను. ఎందుకూ అంది. చెప్పాను. నాకంటె కబుర్లపోగు మా అమ్మాయి. తిన్నగా పక్కనున్న కాన్వెంట్ ఫాదర్ దగ్గరి కెళ్ళి అంతా చెప్పేసింది. అంతే ఫాదర్ నీ ఇష్టమొచ్చిన పూలు తీసుకెళ్ళు అనిచెప్పి స్వయంగా కొన్ని పూలుకూడా కోసిచ్చారట. శ్రీమతి, వాణి కలిసి రెండుబుకేలు కంగారుగా కట్టిచ్చారు. తీరా అవి తీసుకుని యూనివర్శిటీకి వెళ్ళడం సిగ్గనిపించింది.

"కాకాసురా! ఎవరికోసంరా బాబూ!" అని మిత్రులు నిలదీస్తారని స్కూటర్ బేగ్‌లోనే ఉంచి, మీటింగ్ జరగబోయే చోటుకి వెళ్ళాను.

పంతులుగారికి విశ్వవిద్యాలయంలో 'తలతిరుగుడు లేక 'బుర్ర తిరుగుడు' అనే పద్ధతి మీద ఏ శాఖాధిపతిగానో ప్రమోషన్ రాలేదు. కాబట్టి అక్కడ కాకా పట్టడానికి కుర్రాళ్ళు కొట్టుకోవడం లేదు. యూనివర్శిటీ స్టూడెంట్స్ యూనియన్ ఎలక్షన్ అంతర్కితమే అయింది కాబట్టి ఈ మీటింగు గురించి రాయడానికి యూనివర్శిటీలో ఏ గోడా ఖాళీ లేదు! అది సినీ తారా వాళ్ళ అభినందన సభ కాదు కాబట్టి వయసు ముదిరిన విశ్వవిద్యాలయ అధ్యాపకులు గంట ముందుగానే ముందు పంక్తిలో పోటీపడి కూర్చోలేదు. ఈ కార్యక్రమానికి ఏ సినీ నటీమణి అధ్యక్షత వహించలేదు కాబట్టి ఆమెను చూసి తరించాలని పోస్ట్ గ్రాడ్యుయేట్లు డాక్టరేట్లు పోటీపడి వేదిక మీదకు ఒకరి నొకరు తీసుకురావడం లేదు. ఇంకెక్కడా చోటు దొరకలేదు కాబట్టి సాధారణంగా కాంటీన్‌లో పార్టీ లిచ్చే చోటే మేమంతా చేరాం. కానీ అక్కడ కూడా ఒక అవాంతరం వచ్చి పడింది. ఎలాగూ మెస్‌లలో భోజనం బాగుండటం లేదు కాబట్టి, కక్కుర్తిగా కాంటీన్‌లో తింటున్నవాళ్ళు వచ్చినట్లు వింటారన్న నమ్మకంతో కాబోలు కొంతమంది కుర్రాళ్ళు కాంటీన్ టేబుల్ మీద వివిధ వాయిద్యాలను వాయించడం ప్రారంభించారు. తర్వాత కొన్ని గార్దభాలు కూడా చేరి గాత్రదానం చేస్తూ, అక్కడ సంగీత కచేరీ ప్రారంభించారు. కాంటీన్ ఖాళీచేసి జనాలు వెళిపోతున్నా కుర్రాళ్ళ సంగీత కచేరీ ఆపలేదు. ఇక్కడ మాకొక మీటింగ్ ఉందని రెడ్డిగారు అభ్యర్థిస్తే ఏ కళన ఉన్నారో ఏమో పాపం మరికొంతసేపు మమ్మల్ని వాయించి మరీ వెళ్ళిపోయారు కుర్రాళ్ళు.

డబ్బులిచ్చి పద్యరత్నాలు రాయించుకునే స్తోమత పంతులుగారికి లేదు కాబట్టి, ఏ కవీశ్వరుడూ ఏదీ రాసుకుని పట్టుకుని రాలేదు. అసలు వచ్చినవాళ్ళే చాలా తక్కువమంది. ఆ వచ్చిన వాళ్ళు కూడా ముళ్ళమీద కూర్చున్నట్లు కొంతమంది కూర్చుంటే మరి కొంత మంది కొంపలు మునిగిపోతున్నట్టు రెండు నిమిషాలుండి వెళిపోయారు.

ఇంతలో పంతులుగారొచ్చారు. అందరికీ నమస్కరించారు. నాకుమాత్రం చాలా కంగారుగా ఉంది. నేను సృష్టించిన పాత్ర వాస్తవ పరిస్థితుల్లో ఎలా ప్రవర్తిస్తుందేమోనని ఆతృతగా ఉంది నాకు. పోస్ట్‌మన్ సారీ పోస్టల్ క్లర్క్‌గా ప్రమోషన్ అయిన పంతులుగారి మెడలో దండలు పడ్డాయి. ఒక రీడరుగారు ఆప్యాయంగా పంతులుగార్ని కుర్చీలో కూర్చోబెట్టారు. మరో రీడరుగారు ఆయన చేతిలో పుష్పగుచ్ఛాలు వుంచారు. డాక్టర్ ఎల్లయ్య ఏదో కవరు కూడా అందజేశారు. కానీ నేనుమాత్రం ఆంధ్రప్రభ వీక్లీ కథ కట్టింగ్ మాత్రమే పంతులుగారి కిచ్చాను. ఆయన దాన్ని కళ్ళ కద్దుకున్నారు. మిత్రులు సత్యన్నారాయణ(లా), రామదాసు, ప్రసాద్, శాస్త్రి ... అప్పారావు ... ఇంకా ఎందరో చప్పట్లు కొడుతున్నారు. పంతులుగారి కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. నేను రాసిన సన్నివేశం కంటే ఈ సన్నివేశం ఇంకా రక్తికట్టింది. కాని అంత సంతోషంలోనూ అసంతృప్తి ఎక్కడో కలుక్కుమంది. నా మిగతా పాత్రలుగూర్ఖా బహదూర్, పేపర్‌మాన్ ఇబ్రహీం, పాకీ సైదమ్మ, నర్స్ మరియమ్మ మా కెపుడు సన్మానమని అడుగుతున్నట్టు అనిపించింది. ఉద్దేశ్యం మంచిదైతే ఏ ఉద్యమమైనా జయప్రదం అవుతుంది. ఒకరికి సన్మాన మవుతూందిగా—మిగతా పాత్రలకూ త్వరలో తప్పక అవుతుంది అని అంతరాత్మ హామీ ఇచ్చింది.

కల నిజమవచ్చు. కాని కథ నిజమవడం అరుదు. నా కథ నిజమైంది. పదమూడేళ్ళ క్రితం ఈ విశ్వవిద్యాలయంలోనే చదువుకుని, తర్వాత జీవితాన్ని చదివి మళ్ళీ ఇక్కడికే చదువుకోడానికి వచ్చినప్పుడు, ఈ ఆలయంలో నా కథ నిజమవడం నిజంగా నా అదృష్టం. రచయితగా నా జీవితం ధన్యమైంది,

(నా కథను నిజంచేసిన విశ్వవిద్యాలయ రీడర్లకు లెక్చరర్లకు, స్కాలర్లకు ఈ పంతులుగారి కథ అంకితం.)

*

శ్రీటెక్స్
ఫ్యాబ్రిక్స్
ఇంటింటి
అవసరాలకు...
ఇంటిల్లపాది
ఆనందానికి...
శ్రీటెక్స్
దుప్పట్లు
శ్రీటెక్స్
తువ్వాళ్ళు
శ్రీటెక్స్
ఫర్నిషింగ్స్
అందానికి...
ఆకర్షణకి...
మన్నికకు...నమ్మికకు
మేలైన రంగులకు
వాడండి!
SreeTEX® SALEM
ఉత్పత్తిదారులు:
ఓ.జి. టెక్స్‌టైల్స్
(ప్రై) లిమిటెడ్.
సేలం-636006